తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

శనివారం 10-10-2026 సంపుటి : 01 సంచిక : 68 పేజీలు : 4 వెల : రూ 2-00

కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, శ్రీకాకుళం, విజయవాడ, హైదరాబాద్.

స్థానిక ఎన్నికలపై జగన్‌ది రెండు నాలుకల ధోరణి.. సీఎం ధ్వజం



ప్రకాశం జిల్లా, అక్టోబరు 9 : స్థానిక సంస్థల ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలపై వైసీపీది రెండు నాలుకల ధోరణి అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రకాశం జిల్లాలోని కొండపి నియోజకవర్గం నర్సింగోలులో పర్యటించిన ముఖ్యమంత్రి.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మీ భూమి-మీ హక్కు సభలో పాల్గొని, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సీఎం ప్రసంగించారు. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ నేతలు ఓడిపోతే... వచ్చే నాలుగు ఓట్లు కూడా తమకురావని భయపడుతున్నారని విమర్శించారు.

ఇక్కడ ఉంది 1995 సీబీఎన్..

ఈ ఎన్నికల్లో ఓడిపోతే తమ పార్టీ నేతలు ఇళ్లల్లో పడుకుంటారని జగన్ భయపడుతున్నారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 24శాతం రిజర్వేషన్లు పెట్టారని.. తాను దాన్ని 34 శాతానికి పెంచానని ప్రస్తావించారు. తాను 34శాతం రిజర్వేషన్లు పెంచితే జగన్ హయాంలో దాన్ని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఇక్కడ ఉంది 2014 సీబీఎన్ కాదని... 1995 సీబీఎన్ అని ఉద్ఘాటించారు. వైసీపీ హయాంలో 16,800 మంది స్థానిక సంస్థల్లో నాయకత్వాన్ని కోల్పోయారని దుయ్యబట్టారు. చట్టప్రకారం తాము బీసీలకు మళ్లీ రిజర్వేషన్లు పెంచితే గొడ్డలి పార్టీకి ఎందుకు ఇష్టం లేదని ప్రశ్నించారు.

బీసీ రిజర్వేషన్లకు జగన్ అండ్ కో అడ్డం పడ్డారు..

కోర్టుకెళ్లి బీసీ రిజర్వేషన్లకు జగన్ అండ్ కో అడ్డం పడ్డారని ముఖ్యమంత్రి ఆగ్రహించారు. 50 శాతానికంటే రిజర్వేషన్లు మించకూడదని సుప్రీంకోర్టు కొట్టేసే పరిస్థితి వచ్చిందని అన్నారు. వెనకబడిన వర్గాలంటే వైసీపీకి గిట్టదని మండిపడ్డారు. వారి రుణం తీర్చుకోవాలని తనకు తపన ఉందని చెప్పుకొచ్చారు. బీసీలకు 34శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లను పార్టీ పరంగా ఇచ్చి గెలిపించుకుంటామని.. అది తన బాధ్యత అని ఉద్ఘాటించారు. వైసీపీ నేతలు ఒకపక్క 'సర్' ప్రక్రియ వద్దంటున్నారని.. కానీ మరోపక్క 'సర్' పూర్తి అయ్యేవరకు ఎన్నికలు వద్దని కోర్టుకు వెళ్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీకి వెనకబడిన వర్గాలు వెన్నెముక అని చెప్పుకొచ్చారు. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ బుల్లెట్ స్పీడ్‌తో నడుస్తోందని వ్యాఖ్యానించారు.

డ్రోన్ టెక్నాలజీకి ఏపీ చిరునామా..

స్థానిక సంస్థల్లో త్రిబుల్ ఇంజిన్ వేగంతో ముందకెళ్తామని సీఎం తెలిపారు. ఏపీ అభివృద్ధిలో రాబోయే రోజుల్లో డ్రోన్ల భాగస్వామ్యం ఉంటుందని.. యుద్ధానికి కావాల్సిన డ్రోన్లు కూడా ఇక్కడే తయారవుతాయని వివరించారు. ఇరాన్‌లో యుద్ధం మనుషులు చేయలేదని.. డ్రోన్లతో చేశారని ప్రస్తావించారు. డ్రోన్ టెక్నాలజీకి ఏపీనే చిరునామాగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం చేస్తామని వ్యాఖ్యానించారు. గోదావరి, కావేరి నదులు అనుసంధానం చేస్తే నాలుగు రాష్ట్రాలు, ఐదు జీవనాధులు అనుసంధానం అవుతాయని తెలిపారు. రామాయపట్నంలో రూ.1.50,000 కోట్లతో బీపీసీఎల్ పరిశ్రమ నిర్మిస్తామని వెల్లడించారు. గోవా కంటే మించిన ప్రదేశం మన సూర్యలంక అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

మీ భూమి-మీ హక్కును కాపాడే బాధ్యత మాది: చంద్రబాబు



ప్రకాశం, అక్టోబర్ 9: రైతు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలి గానీ, అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరగడానికి వీలు లేదని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'మీ భూమి మీ హక్కు, భూమి మీదే హక్కు మీదే. ఆ హక్కు కాపాడే బాధ్యత మాది. ఇది సీబీఎన్ మార్క్' అని స్పష్టం చేశారు. కొండపి నియోజకవర్గం నర్సింగోలులో పర్యటించిన ముఖ్యమంత్రి.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మీ భూమి-మీ హక్కు సభలో పాల్గొని, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 40.58 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. అక్టోబర్‌లోనే 793 గ్రామాల్లో 4.58 లక్షల మందికి పాస్ పుస్తకాలిచ్చామని.. ప్రకాశం జిల్లాలోనే 24,116 పాస్‌పుస్తకాలను ఇచ్చినట్లు తెలిపారు. పాస్ పుస్తకాల పంపిణీ కోసం అధికారులకు టార్గెట్ ఇచ్చామని.. టార్గెట్ అందుకోకపోతే అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్యపాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని సీఎం అన్నారు. ఈ రిజర్వాయర్ రెండు సంవత్సరాల్లో పూర్తవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.166 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. నీళ్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని.. దీనివల్ల 9,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఎప్పుడో నరకాసురుడు వధ జరిగితే ఈరోజు కూడా దీపావళి జరుపుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

అమరావతి చెస్ అకాడమీ ఏర్పాటుకు మంత్రి లోకేశ్ హామీ.. కేనేరు హంపితో భేటీ



అమరావతి, అక్టోబరు 9: ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి ఆమె తండ్రి అశోక్.. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై లోకేశ్‌తో వారు చర్చించారు. అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం తరపున మద్దతుగా నిలవాలని కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారు. తమ ప్రభుత్వం తరపున సహాయ సహకారాలను అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్-2026 మహిళల విభాగంలో భారత జట్టు కాంస్య పతకం, వ్యక్తిగత విభాగంలో కోనేరు హంపి బోర్డు-1లో కాంస్య పతకం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హంపికు మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు.

స్థానిక ఎన్నికలపై పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్.. ఆ కమిటీల ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 9: స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన హై కమాండ్ ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ ఎన్నికల కోసం 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ హై కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కమిటీల పనితీరును ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షించనున్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణకు ఆ కమిటీలకు ఆదేశాలు ఇవ్వనున్నారు. విజయవాడ పార్లమెంట్ మినహా మిగతా పార్లమెంట్ కమిటీలను ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగానే త్వరలో పార్లమెంట్ నియోజకవర్గాల కమిటీలతో పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు. జనసేన సంస్థాగత బలోపేతం, ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. ఈ ఎన్నికల కోసం మరో నాలుగు కేంద్ర కమిటీల నియమించారు.ఈ ఎన్నికల నిర్వహణ, మార్గదర్శక కమిటీలను ఏర్పాటు చేశారు. కూటమి సమన్వయం కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ఎన్నికల ప్రచార నిర్వహణకు ప్రచార కమిటీని ఏర్పాటు చేశారు. జనసేన ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ట్రెజరీ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు జనసేన హై కమాండ్ ప్రకటించింది.



ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్.. ఓటర్ల జాబితా, బీసీ రిజర్వేషన్లపై కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వోన్నత న్యాయస్థానం మార్గం సుగమం చేసింది. ఏపీ హైకోర్టు విధించిన ఆరు వారాల గడువులోగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసులో కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ, ఎన్నికల ఆలస్యానికి తావులేకుండా ముందుకు వెళ్లాలని ఆదేశించింది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే సమయానికి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ పూర్తయితే, కొత్తగా రూపొందించిన సమగ్ర ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికలు నిర్వహించాలి. ఒకవేళ నోటిఫికేషన్ సమయానికి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పూర్తి కాకపోతే, ప్రస్తుత పాత ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఢిల్లీలో హైఅలర్ట్.. పర్యటనలు రద్దు చేసుకుని రంగంలోకి దిగిన అమిత్ షా



ఢిల్లీ, అక్టోబర్ 09: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఢిల్లీ నగరంలో హైఅలర్ట్ ప్రకటించింది. నగరవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసింది. అందుకోనం భారీగా పోలీసులు, భద్రతా బలగాలను మోహరించింది.దేశంలోని వివిధ రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ నుంచి దాదాపు 7 వేల మంది సీఆర్పీఎఫ్ సిబ్బందిని ఇప్పటికే ఢిల్లీకి తరలించారు. ఢిల్లీ వ్యాప్తంగా 20 వేలకు పైగా పోలీసు, పారా మిలటరీ బలగాలతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఏమైనా అల్లర్ల జరిగితే.. గుంపులను చెదరగొట్టేందుకు యాంటీ రైట్ ఆయుధాలతో బలగాలు రంగంలోకి దింపారు.మరో వైపు ఢిల్లీలోని భద్రతా పరిస్థితిని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అందుకోసం వివిధ రాష్ట్రాల పర్యటనను ఆయన రద్దు చేసుకున్నారు. శనివారం సీజేపీ ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో పరిస్థితిపై అత్యున్నత స్థాయి అధికారులతో ఆయన ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టనున్న నిరసనకు అనుమతిని ఇప్పటికే ఢిల్లీ పోలీసులు నిరాకరించారు. ఆందోళనకు అనుమతి లేదని సీజేపీకి ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉందని తెలిపారు.ఇంకో వైపు సోషల్ మీడియాపై నిఘా పెట్టారు. నిరసనల పేరుతో ఉద్రిక్తతలు సృష్టించే తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. ఇక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఢిల్లీ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఢిల్లీ సరిహద్దుగా ఉన్న రాష్ట్రాలు నిఘా నీడలో వెళ్లాయి.ఢిల్లీ ప్రజలను హెచ్చరించిన పోలీసులుశనివారం సీజేపీ నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు డీసీపీ నృపి పాండే సూచించారు. విధులకు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిరసనల్లో పాల్గొన వద్దని ప్రజలకు తెలిపారు. మీ భద్రతతోపాటు కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తాం: అచ్చెన్నాయుడు

అమరావతి, అక్టోబర్ 9: ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.బీసీలకు సంబంధించిన అంశాల్లో న్యాయస్థానాల నిర్ణయాలను గౌరవిస్తూనే.. వారికి రాజకీయంగా తగిన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక సందర్భంగా బీసీలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. బీసీల



రాజకీయ ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి ఆత్మగౌరవం, రాజకీయ సాధికారతకు పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బీసీ వర్గాలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం లభించినప్పుడే వారి అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని మంత్రి అభిప్రాయపడ్డారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గిన విషయాన్ని ఆ వర్గాల ప్రజలు మరిచిపోలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడం, వారి హక్కులను కాపాడటం, సామాజికంగా మరింత ముందుకు తీసుకెళ్లడం తమ పార్టీ లక్ష్యమని తెలిపారు.ఁ నుంచి ఎన్నికల ప్రక్రియ వరకు తగిన ప్రాధాన్యం కల్పించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. బీసీల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా, వారికి రాజకీయ సాధికారత కల్పించేలా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

శనివారం 10-10-2026

ఎరుపు రంగులోకి భూగోళం..

సూపర్ డూపర్ ఎల్‌నినో

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన ఎల్ నినో క్రమంగా తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే దీని ప్రభావంతో భారత్ సహా దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని ఇటీవల ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజాగా, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. సూపర్ ఎల్ నినో దెబ్బకు భూగోళం మొత్తం ఎరుపుగా మారిపోయిందని మ్యాప్‌ను షేర్ చేశారు.గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకుంటోన్న ఎల్ నినో ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1950 తర్వాత నమోదుకాబోతున్న అత్యంత బలమైన వాతావరణ పరిణామాలలో ఇది ఒకటి కావచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఈ ఎల్ నినో మరింత పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. పసిఫిక్ మహానముద్రం అంతర్భాగంలో దాగివున్న అధిక ఉష్ణోగ్రతలను బయటకు విడుదల చేయడం వల్ల భూగోళంలో అత్యధిక భాగం అసాధారణమైన వేడిని ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.రియాన్ మౌ అనే అంతర్జాతీయ వాతావరణ నిపుణుడు మొత్తం భూగోళానికి సంబంధించిన క్లైమేట్ మ్యాప్‌ను సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకుంటూ... భూగోళం అంతా దాదాపుగా ఎరుపు రంగులోకి (తీవ్రమైన వేడికి సూచికగా) మారిపోయిందని పేర్కొన్నారు. "అమెరికా మినహా మిగిలిన ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచుతూ ఈ ఎల్ నినో శీతాకాలంలో కూడా తన 'గరిష్ట ప్రతాపాన్ని' చూపిస్తోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎల్ నినో తీవ్రత వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న చిట్కా అంచనాతో ఆయన కూడా ఏకీభవించారు.మరో శాస్త్రవేత్త జీకే హోస్‌ఫాథర్ స్పందిస్తూ... "ఈ ఏడాది ఎల్ నినో రికార్డులను తిరగరాస్తూ కొత్త గరిష్ఠాలకు చేరుకుంటోంది.. నినో 3.4 ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఇది ఇప్పటివరకు నమోదైన ఏ ఇతర ఎల్ నినో పరిణామం కంటే కూడా అత్యధికం" అని పేర్కొన్నారు. లియోన్ సిమన్స్ అనే మరో నిపుణుడు ఈ పరిణామాన్ని 'సూపర్-డూపర్ ఎల్ నినో' గా అభివర్ణించారు.ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని ఎక్కువ భాగంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ నినో పుట్టకకు కేంద్రమైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు.సాధారణంగా ఎల్ నినో అనేది సహజంగా సంభవించే 'ఎల్ నినో-సౌత్ ఐసోలేషన్' చక్రంలో భాగమైన ఒక వేడి దశ. ఇది ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఈ వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, వర్షపాత వ్యవస్థలు దెబ్బతింటాయి. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరువు కాటకాలు, మరికొన్ని ప్రాంతాల్లో తుఫానులు, భారీ వర్షాలు సంభవిస్తాయి.ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన ఈదురుగాలులు, తీరప్రాంత వరదలు, బీచ్ కోత ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించిన కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, శీతాకాలపు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గత నెలలోనే రాష్ట్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై సరఫరా వైపు నుంచి ఒత్తిళ్లు కొనసాగొచ్చని ఆర్బీఐ తెలిపింది. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు దీనికి కారణమవుతాయని పేర్కొంది. చమురును మినహాయిస్తే ఆహార విభాగంలోని పలు కమోడిటీల ధరల్లో కూడా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్ ద్రవ్యోల్బణం పెరగడం, సీపీఐ బాస్కెట్‌లోని మరిన్ని వస్తువుల ధరలు పెరగడం చూస్తే ద్రవ్యోల్బణం ఒకటి రెండు వస్తువులకు పరిమితం కాకుండా విస్తృతంగా మారే తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ తెలిపింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 2026-27లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. రెండో త్రైమాసికంలో 4.9 శాతం, మూడో త్రైమాసికంలో 6.0 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. 2027-28 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. దీనికి సంబంధించిన రిస్కులు కూడా ఇరువైపులా సమానంగా ఉన్నాయని పేర్కొంది. 2026-27 మొత్తం సంవత్సరానికి కోర్ ద్రవ్యోల్బణం 4.4 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది.అమెరికాలోని ఆరు రాష్ట్రాలు ఈ శీతాకాలంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం, భారీ హిమపాతాన్ని ఎదుర్కోనున్నాయి. కాలిఫోర్నియాతో పాటు నెవాడా, ఉటా, కొలరాడో, న్యూ మెక్సికో, అరిజోనా రాష్ట్రాలపై ఈ ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని పర్వత ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల్లో సగటు కంటే చాలా ఎక్కువగా హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత'

ఒక్క నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలంలో వినతుల స్వీకరణ

మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి

కర్నూలు (తెలుగు కలం) అక్టోబర్ 09:-నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఒక్క నెల?ఒక నియోజకవర్గం?నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంత్రాలయం నియోజకవర్గంలో మూడవ పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దకడుబూరు మండల కేంద్రంలోని చంద్రమ్మ భవనంలో ఏర్పాటు చేసిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు రెవెన్యూ, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, గృహ వసతి, పింఛన్లు, ఇతర మౌలిక సదుపాయాలు మరియు స్థానిక ప్రజా సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి, సంబంధిత సమస్యల అర్జీలను ఆయా శాఖలకు పంపించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి లేకుండా, అందిన వినతులపై బాధ్యతాయుతంగా స్పందించి, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ దేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బజారి , జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు భరోసా.. నూతన డిజిటల్ పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ!

ఉడుములపాడు రైతులకు పాసుబుక్‌లు అందజేసిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి



డోన్ (తెలుగు కలం ప్రతినిధి)అక్టోబర్ 09:-డోన్ మండలం ఉడుములపాడు గ్రామంలో రీసర్వే ప్రక్రియలో భాగంగా రూపొందించిన నూతన పట్టాదారు డిజిటల్ పాస్‌బుక్‌లను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి రైతులకు పంపిణీ చేశారు. భూ రికార్డుల ప్రక్షాళన, భూముల వివరాల్లో పారదర్శకత పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన రీసర్వే ప్రక్రియలో భాగంగా రైతులకు నూతన డిజిటల్ పట్టాదారు పాస్‌బుక్‌లను అందజేశారు. ఈ నందర్భంగా రైతులకు భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండటం ఎంతో ముఖ్యమని, డిజిటల్ పాస్‌బుక్‌ల ద్వారా భూ వివరాలను భద్రపరచుకోవడంతో పాటు భవిష్యత్తులో అవసరమైన సందర్భాల్లో వాటిని వినియోగించుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా సీఎం సహాయ నిధి!

రూ.22.13 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి



డోన్(తెలుగు కలం) అక్టోబర్ 09:-ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా లభించింది. డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మొత్తం రూ. 22,13,255 (ఇరవై రెండు లక్షల పదమూడు వేల రెండు వందల యాభై ఐదు రూపాయలు) విలువైన చెక్కులను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోంది. వైద్య ఖర్చులను భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనివ్వడంతో పాటు, చికిత్స కొనసాగించేందుకు తోడ్పడుతోంది. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అందజేశారు. పేదలకు వైద్య సాయం అందించడమే లక్ష్యంఅనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే సాయం కీలకంగా ఉపయోగపడుతుంది. వైద్య చికిత్సల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ నిధులు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తాయి. అర్హులైన బాధితులకు ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాన్ని చేరవేయడం ద్వారా వారి కష్టాల్లో భాగస్వాములయ్యే అవకాశం కలుగుతుంది.ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం రూ. 22,13,255 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన నిధులు బాధితుల వైద్య అవసరాలకు ఉపయోగపడనున్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు ఆటంకం కలగకుండా ఇలాంటి సహాయ కార్యక్రమాలు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఘనవిజయంతో గెలిపించండి: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మగట్ట తెలుగుకలం ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలోనూ అఖండ మెజారిటీతో విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకుని పనిచేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి ఒక్కరినీ నేరుగా కలవాలని ఆయన సూచించారు. గుమ్మగట్ట మండలం మారేంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు, గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడంతో పాటు రూ. 60 లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసి, ప్రజాదర్బార్ నిర్వహించి స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికిన ఓటర్లు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి విజయాన్ని అందించారని తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ సమపాళ్లలో ముందుకు సాగుతోందని, ఎన్నికల వేళ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో దాదాపు అన్నింటినీ ప్రభుత్వం నెరవేర్చిందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల భవనాలు, రోడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతులకు గోకులం షెడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేసే అవాస్తవ ప్రచారాన్ని కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆయన హెచ్చరించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితర స్థానిక ఎన్నికల్లో కూటమి గెలిస్తేనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.





మారేంపల్లి గ్రామానికి అభివృద్ధి వరాలు

కష్టకాలంలో తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన మారేంపల్లి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఊరి ప్రజల కోరిక మేరకు మారెమ్మ గుడి రోడ్డు నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పాఠశాల నిర్మాణానికి దేవాలయ భూమి కేటాయింపు అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాలువ సన్నన్న, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, మాజీ సర్పంచ్ కురుబ జ్యోతి, రామంజినేయులు, ఉస్మాన్ సాబ్, యూనిట్ ఇంచార్జ్ సంజీవ, గొల్ల వెంకటేశులు, కేపీ దొడ్డి నాగరాజు, కురుబ రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ నెల 11న ఏఐఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

విద్యారంగ సమస్యలపై విజయవాడ సమావేశంలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: దామోదర్

ధర్మవరం, అక్టోబర్ 9: (తెలుగు కలం)ఈ నెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్‌యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు దామోదర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శుక్రవారం ధర్మవరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విద్యార్థి నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీల బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థుల చదువులకు ఆటంకాలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో కనీన మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు వంటి అవసరమైన వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలని కోరారు.విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ ఈ నెల 11న విజయవాడలో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చిస్తామని దామోదర్ తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను కూడా ఈ సమావేశంలో ప్రకటిస్తామని వెల్లడించారు.ధర్మవరం ప్రాంతం నుంచి విద్యార్థులు, ఏఐఎస్‌యూ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విజయవాడకు తరలివచ్చి రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు ప్రకాష్, సిద్ధార్థ్, విజయ్, మహేంద్ర, లోకేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నంద్యాల పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యురాలిగా జాఫరున్నిష

నియామకంస్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం: జాఫరున్నిష

బనగానపల్లె (తెలుగు కలం) అక్టోబర్ 09:-జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయానికి సంబంధించి నంద్యాల పార్లమెంట్ కమిటీలో భాగంగా ఏర్పాటు చేసిన నిర్వాహక దళ్ నభ్యురాలిగా బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన జనసేన వీర మహిళ జాఫరున్నిష



నియమితులయ్యారు. పార్టీ ఆమెకు ఈ బాధ్యతను అప్పగించడంతో జనసేన శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది.ఈ సందర్భంగా జాఫరున్నిష మాట్లాడుతూ జనసేన పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు వంద శాతం విజయం లక్ష్యంతో ముందుకు సాగేందుకు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గెలుపు లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.తనకు ఈ బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనతో పాటు నిర్వాహక దళ్ సభ్యులుగా ఎంపికైన జనసైనికులకు అభినందనలు తెలియజేశారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని జాఫరున్నిష స్పష్టం చేశారు.

డోన్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా దరఖాస్తులు, రికార్డుల పరిశీలన

ఫారం 6, 7, 8 దరఖాస్తుల నిర్వహణపై ఈఆర్ఓలకు రోల్ అబ్జర్వర్ ప్రశాంతి సూచనలు



నంద్యాలజిల్లా డోన్ (తెలుగు కలం) అక్టోబర్ 09:-ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల పరిశీలన, రికార్డుల నిర్వహణలో నిబంధనలు పక్కాగా పాటించాలని రోల్ అబ్జర్వర్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ డైరెక్టర్ ప్రశాంతి సంబంధిత ఎన్నికల అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె డోన్ నియోజకవర్గంలో పర్యటించి, ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులను, వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించారు.ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి నిర్వహణ, పరిశీలన ప్రక్రియలో పాటించాల్సిన విధానాలను సమీక్షించారు. రికార్డుల నిర్వహణలో ఉన్న లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు) తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలతో రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. డోన్ ఆర్డీఓ నరసింహులు, సంబంధిత ఏఈఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు

కణేకల్ మండలంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

మధ్యాహ్న భోజన పథకంపై అధికారుల ఆకస్మిక తనిఖీ

కణేకల్ తెలుగుకలం ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కణేకల్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను వివిధ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తహశీల్దార్ బ్రహ్మయ్య, డి ఎల్ డి ఓ అమానుల్ల, ఎంపీడీవో విజయసింహా రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో షేక్షావలి, ఈవోఆర్ డి చంద్రమౌళి, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ నాగమధు పాల్గొన్నారు. కణేకల్ గ్రామంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అధికారులు, అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, ఓటర్ల సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు.





ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో వీఆర్వో పవన్ కుమార్, పంచాయతీ ఈవో మంజులతో పాటు పలువురు రెవెన్యూ, పోలీసు సిబ్బంది కూడా పాలుపంచుకున్నారు. ఎన్నికల విధులను సమీక్షించడంతో పాటు, అధికారులు కణేకల్ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించిన అధికారులు, నేరుగా వంటశాలలకు వెళ్లి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కఠినంగా హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, నిర్దేశించిన మెనూ ప్రకారమే రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

నూతన సీసీ రోడ్లు, కాలువలతో మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు



డోన్ (తెలుగు కలం)అక్టోబర్ 09:-డోన్ పట్టణంలోని 32వ వార్డులో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా వార్డుకు నూతనంగా మంజూరైన సీసీ రోడ్లు, సీసీ కాలువల వివరాలను స్థానిక ప్రజలకు వివరించారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, కాలువల నిర్మాణం ద్వారా మురుగునీటి సమస్యలు తగ్గి పరిసరాల పరిశుభ్రత మెరుగవుతుందని వివరించారు.అనంతరం వార్డులో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కోట్ల సుజాతమ్మ హామీ ఇచ్చారు.వార్డుల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెంచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమించాలి

మంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ పరిశీలకులు ప్రభాకర్ చౌదరి పిలుపు



నంద్యాల (తెలుగు కలం) అక్టోబర్ 09:నంద్యాల పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం నంద్యాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వి. ప్రభాకర్ చౌదరి హాజరయ్యారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారుఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్, ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు, నాయకులు తమ మధ్య ఉన్న చిన్నపాటి భేదాభిప్రాయాలు, వ్యక్తిగత విభేదాలను పూర్తిగా పక్కనపెట్టి కూటమి గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపైనా ఉందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మరియు అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ చేరవేయాలని సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో కష్టపడే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్ర రావు , జిల్లెల్ల శ్రీరాములు , ఏవిఆర్ ప్రసాద్, డైరెక్టర్లు తాతిరెడ్డి తులసిరెడ్డి, మునియార్ ఖలీల్ , దూదేకుల దస్తగిరి, ఉప్పరి సురేష్ కుమార్, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి , గోస్పాడు కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , మాజీ కౌన్సిలర్లు, దేవస్థానం చైర్మన్ లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మందికి ఒకే ఇల్లు అమ్మకం

భాగ్యనగరంలో బడా మోసగాళ్లు

హైదరాబాద్, అక్టోబరు 9 హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోవైపు ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.సుమతి హెచ్చరించారు.మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ప్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషీద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తపు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలి రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్‌పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టేజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ప్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరామ్ ఫైనాన్స్ దోపిడీపై ఆర్బీఐ విచారణ జరపాలి:

రాయదుర్గంలో సీపీఐ, ఏఐవైఎఫ్, రైతు సంఘం ధర్నా



రాయదుర్గం తెలుగుకలం ప్రతినిధి : అనంతపురం జిల్లా రాయదుర్గం కనేకల్ రోడ్డులోని శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐవైఎఫ్, ఏపీ రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాధితుడు డాక్టర్ హెచ్.హెచ్. రంగస్వామితో కలిసి నిరసన ధర్నా నిర్వహించారు. చిరు వ్యాపారులు, రైతులు, ఆటో డ్రైవర్లు, ఉద్యోగుల అవసరాలను అడ్డం పెట్టుకుని అధిక వడ్డీల పేరుతో శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ జలగలా పీల్చేస్తోందని వామపక్ష నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా బాధితుడు డాక్టర్ రంగస్వామి వ్యవహారాన్ని నాయకులు బయటపెట్టారు. ఆయన తన ఇంటిపై రెండు విడతల్లో రుణాలు తీసుకున్నారు. మొదటిసారి 2024 జనవరి 1న రూ. 15 లక్షలు రుణం తీసుకోగా, నెలకు రూ. 52,450 ఈఎంఐ చొప్పున గత 25 నెలల్లో రూ. 13,06,350 చెల్లించారు. అనంతరం అదే ఏడాది డిసెంబర్ 31న రూ. 35 లక్షలు రుణం తీసుకుని, నెలకు రూ. 1,21,334 చొప్పున 15 నెలల్లో రూ. 16,96,024 కట్టారు. ఇప్పటివరకు దాదాపు రూ. 30 లక్షలు చెల్లించినప్పటికీ, రుణాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు వెళ్తే ఆ మొత్తమంతా వడ్డీకే సరిపోయిందని, ఇంకా రూ. 46 లక్షలు చెల్లించాలని నిర్వాహకులు చెప్పడం దారుణమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా డివిజనల్ మేనేజర్ పేరు చెప్పి రూ. 1 లక్ష కమీషన్ వసూలు చేయడం, ఇన్సూరెన్స్ తప్పనిసరి అని బెదిరించి మరో రూ. 50 వేలు తీసుకోవడం, ఒక్కో అధికారి ఒక్కోలా వడ్డీ రేట్లు చెప్పి తికమక పెట్టడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ముందస్తుగా లోన్ క్లోజ్ చేస్తామంటే వడ్డీ తగ్గించకుండా బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావలి కోటేష్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి తిప్పేస్వామి, సీపీఐ రాయదుర్గం పట్టణ కార్యదర్శి రవి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రాజు పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల రక్తాన్ని తాగుతున్న ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని, తక్షణమే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగి రాయదుర్గం బ్రాంచ్‌పై సమగ్ర విచారణ జరిపి సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు డాక్టర్ రంగస్వామితో పాటు మిగతా బాధితులకు ముందస్తు లోన్ క్లోజర్‌లో వడ్డీ మినహాయింపు కల్పించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు కుమార్ నాయక్, గోపీనాథ్, భాను, ఉత్తమ్, వినీత్, నవీన్, జశ్వంత్, మనోజ్, రమేష్, మలేష్, విరంజీ తదితరులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వరస్వామి ఆలయం నుంచే అంతా

హైదరాబాద్, అక్టోబరు 9,తెలంగాణ రాజకీయాల్లో మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు నది పరీవాహక ప్రాంతాల అభివృద్ధి, మరోవైపు చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణ పేరిట ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా మంచిరేవుల ప్రాంతంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఏకంగా రూ.1108.27 కోట్ల నిధులను కేటాయించింది. ఈ ఆలయానికి సుమారు 1,400 ఏళ్ల చరిత్ర ఉంది.ఈ ప్రాజెక్టును కేవలం ఆలయ పునరుద్ధరణకు మాత్రమే పరిమితం చేయట్లేదు. దీని వెనుక బలమైన రాజకీయ, వ్యూహాత్మక కోణాలు దాగి ఉన్నాయి. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై మొదటి నుంచి విపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మతపరమైన, సాంస్కృతిక అంశాలను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని ఆకర్షించాలని అధికార పార్టీ ఎత్తుగడ వేసినట్లు అర్థమవుతోంది. రూ.700 కోట్ల ప్రాథమిక అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.1,108 కోట్లకు పెంచడం ప్రభుత్వ ప్రాధాన్యతలను, సంకల్పాన్ని చాటుతోంది.దక్షిణ కాశీగా అభివర్ణిస్తూ చేపట్టబోయే ఈ అభివృద్ధి పనుల్లో రూ.598.98 కోట్లు కేవలం నిర్మాణ పనులకే కేటాయించడం విశేషం.

తెలుగుకలం TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

సీట్ల సర్దుబాటు ఎలా

విజయవాడ, అక్టోబరు 9, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు-పవన్‌ల భేటీలు, పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాత జనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో జనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి-ఫామ్ రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగా మార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములను శాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీ ఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది. పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు-పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయ శ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

విజయవాడ, అక్టోబరు 9, ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిట్రెంచ్‌మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో వివరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ (కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిది ఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజిక వర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ-వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంత మేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లను చీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్త పార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధుల నిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్క శాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

రాజమండ్రి అక్టోబరు 9, ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలం వెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీ టికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేవడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

నెల్లూరు, అక్టోబరు 9, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసిన పిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహం నడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఉ.మా.ఓ.బ.జెనీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైన పరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టు అడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలని చూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరి నాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయ పరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021-26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల "పే కమిషన్ నిధులు" ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతం కోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణ స్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహవ ప్రశ్నలకుసమాధానాలురాబోయే రోజుల్లో కోర్టుతీర్పులతోపాటురాజకీయపరిణామాలు ఇవ్వనున్నాయి .ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీ రిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది? కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం

ప్రతి సమస్యకు నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కారం: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,

గుంటూరు ,జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమంలో ఈరోజు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పాల్గొని, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నుండి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు మరియు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రతి వినతిని జిల్లా ఎస్పీ గారు స్వయంగా పరిశీలించి, శాఖ నిబంధనలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో మరింత సామర్థ్యం, నిబద్ధత, ఉత్సాహం పెరుగుతాయని పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతులు, ఇతర పరిపాలనా నిర్ణయాలు శాఖ నిబంధనలు, ఖాళీలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు.పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించిన ఎస్పీ గారు, సిబ్బంది సంక్షేమం మెరుగుపడితేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించగలమన్నారు.

అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం,మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్ధాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదని కలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్దీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం

విజయవాడ ,నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మల్లికార్జున పేట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ఈ కార్యక్రమ

వామాకు పచ్చడి: పల్లీలు, నువ్వులు, పచ్చిమిర్చితో ఇలా చేస్తే అద్భుతమే!



వామాకు మన ఇళ్లలో సాధారణంగా పెంచుకునే మొక్క. దీని ఆకులతో సాధారణంగా చాలా మంది బజ్జీలు చేసుకుంటారు. కానీ వామాకుతో చేసే పచ్చడి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. దగ్గు, జలుబు, అజీర్ణం వంటి సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. వేడి అన్నం, ఇడ్లీ, దోసె, ఉప్మా వంటి టిఫిన్లతో కలిపి తింటే రుచి మరింత బాగుంటుంది. కావలసిన పదార్థాలు: వామాకు ఆకులు - 30 ఆకులు పల్లీలు - 1 టేబుల్ స్పూన్ నువ్వులు - 1 టేబుల్ స్పూన్ ధనియాలు - 1 టీ స్పూన్ శనగపప్పు - 1 టీ స్పూన్ మినప్పప్పు - 1 టీ స్పూన్ పచ్చిమిర్చి - 10-15 (కారానికి తగ్గట్టు) వెల్లుల్లి రెబ్బలు - 5-6 చింతపండు - చిన్న ముక్క పసుపు - పావు టీ స్పూన్ ఉప్పు - రుచికి సరిపడా నూనె - 2 టేబుల్ స్పూన్లు వెల్లుల్లి రెబ్బలు -5 పోపుకు: ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినప్పప్పు, వెల్లుల్లి, కరివేపాకు, ఇంగువ తయారీ విధానం: ముందుగా వామాకును నీళ్లలో బాగా కడగాలి. ఆపై స్టవ్ వెలిగించి పాన్‌లో కొద్దిగా నూనె వేసి పల్లీలు, ధనియాలు, నువ్వులు వేసి దోరగా వేయించి పక్కన పెట్టుకోండి. అదే పాన్‌లో శనగపప్పు, మినప్పప్పు వేసి వేయించి, పచ్చిమిర్చి కూడా రంగు మారేలా ఫ్రై చేయండి. ఇప్పుడు వామాకు ఆకులను పాన్‌లో వేసి మీడియం ఫ్లేమ్‌పై మూత పెట్టి 4-5 నిమిషాలు మగ్గించండి. ఆపై ఈ అన్నింటిని చల్లారనివ్వండి. ఇలా చేస్తే వామాకు పచ్చడి బాగుంటుంది మిక్సీలో వేయించిన పప్పులు, నువ్వులు, వెల్లుల్లి, చింతపండు, పసుపు వేసి పొడిలా వేయండి. తర్వాత మగ్గించిన వామాకు, పచ్చిమిర్చి, ఉప్పు కలిపి మెత్తగా పేస్ట్‌లా గ్రైండ్ చేయండి. అదనపు నీరు అవసరం లేదు. చివరగా పోపు తయారు చేసి పచ్చడిలో కలపండి. ఆవాలు, జీలకర్ర, పప్పులు, వెల్లుల్లి, కరివేపాకు, ఇంగువ వేసి వేడి పోపు వేస్తే సువాసన బాగా వస్తుంది. ! వామాకు పచ్చడితో ఆరోగ్య ప్రయోజనాలు వామాకులో యాంటీసెప్టిక్, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. దగ్గు, జలుబు, గొంతు నొప్పికి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణశక్తిని పెంచి అజీర్ణం, గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది. రోజూ కొద్దిగా తింటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇంట్లో తాజా వామాకు ఆకులతో ఈ పచ్చడి తయారు చేసి చూడండి. మీరు వదిలిపెట్టకుండా తింటారు నమ్మండి.

రోజూ ఎన్ని కప్పుల కాఫీ, టీ తాగుతున్నారు..!?



ప్రతీ ఇంటా కాఫీ, టీ సాధారణంగా ఉండాల్సిందే. దాదాపుగా ప్రతీ ఒక్కరి దిన చర్య వీటితోనే ప్రారంభం అవుతుంది. అలసటగా అనిపించినా, ఫ్రెండ్స్‌తో కలిసి బయటికి వెళ్లినా టీ నే మొదటి ఛాయిస్. పని ఒత్తిడి నుంచి బయటపడి రిలాక్స్ అయ్యేందుకు టీ తాగుతుంటారు. అయితే వాస్తవంగా చెప్పాలంటే రోజూ మోతాదుకు మంచి టీ, కాఫీలను తాగితే ఆరోగ్యానికి హాని చేస్తాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, రోజుకు ఎంత మోతాదులో టీ తీసుకోవచ్చనేది స్పష్టత ఇస్తున్నారు. టీ, కాఫీల్లో ఉండే కెఫీన్ మనకు హాని కలిగిస్తుందని హెచ్చరిస్తున్నారు. కాఫీ, టీ లో పలు రకాల ఫ్లేవర్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి వినియోగం ఈ మధ్య కాలంలో ఎక్కువగా కనిపిస్తోంది. అయితే.. మన శరీరానికి రోజుకు 400 మిల్లీగ్రాముల వరకు కెఫీన్ చాలు. అంతకు మించితే ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఒక కప్పు టీ లేదా కాఫీ తాగితే సుమారుగా 100 మిల్లీగ్రాముల మేర కెఫీన్ లభిస్తుంది. టీ లేదా కాఫీ ఏదైనా సరే రోజుకు 4 కప్పులకు మించకుండా తాగాలన్నమాట. టీ, కాఫీలను అధికంగా తాగడం వల్ల ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు కలుగుతాయి. నాడీ మండల వ్యవస్థ ప్రభావితం అవుతుంది. కంగారుగా ఉంటారు. నిద్రలేనట్లు, విశ్రాంతి లేనట్లు అనిపిస్తుంది. టీ, కాఫీలను తాగడం వల్ల మన శరీరంలో చేరే కెఫీన్ మెలటోనిన్ ఉత్పత్తి కాకుండా అడ్డుకుంటుంది. ఇది నిద్ర హార్మోన్. రాత్రి పూట మన శరీరంలో ఈ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. దీని వల్లే మనం చీకటి పడగానే ఆటోమేటిగ్గా నిద్రిస్తాం. ంశ్రీబనీ ఖీవజీట తిరుమల భక్తుల కోసం ుఆ కొత్త యాప్ - సకల సమాచారం..!! నిపుణుల సూచనలు అయితే టీ, కాఫీలను తాగడం వల్ల వచ్చే కెఫీన్ మెలటోనిన్ ఉత్పత్తి కాకుండా చూస్తుంది. దీంతో రాత్రి అయినా కూడా నిద్ర పట్టదు. టీ, కాఫీలను అధికంగా తాగితే కొందరికి దీర్ఘకాలంలో జీర్ణాశయంలో అల్సర్లు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని అధికంగా సేవిస్తే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. కొందరికి తలనొప్పిగా ఉంటుంది. వికారంగా కూడా అనిపిస్తుంది. టీ, కాఫీలను అధికంగా సేవించడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడతారు. మూత్ర విసర్జనకు తరచూ వెళ్లాల్సి వస్తుంది. ముఖ్యంగా రాత్రి పూట నిద్రకు ఆటంకం కలుగుతుంది. ఈ పానీయాలను అధికంగా సేవిస్తే శరీరం మనం తినే ఆహారంలో ఉండే ఐరన్‌ను శోషించుకోలేదు. దీంతో రక్తహీనత తలెత్తుతుంది. బీపీ ఎల్లప్పుడూ ఎక్కువగానే ఉంటుంది. కనుక టీ, కాఫీలను అధికంగా తాగుతున్నవారు తగ్గిస్తే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



డయాబెటిస్ ఉన్నవారికి ఏ పండ్లు బెస్ట్..!?



డయాబెటిస్. ఇప్పుడు వేగంగా విస్తరిస్తున్న సమస్య. మారుతున్న జీవన శైలి.. ఒత్తిడితో వయసు తో సబంధం లేకుండా అనేక మంది ఈ సమస్య బారిన పడుతున్నారు. డయాబెటిస్ ను గుర్తించిన సమయం నుంచి జాగ్రత్తగా ఉండాల్సిందే. వైద్యులు సూచించిన మందులతో పాటుగా జీవన శైలి.. ఆహారపు అలవాట్లు మా ర్చుక ోవాలి. అదే విధంగా డయాబెటిస్ ఉన్న వారు పండ్లు తీసుకోవటం పైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. షుగరు ఉన్నవారు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ మరియు ఎక్కువ ఫైబర్ ఉన్న పండ్లను తినాలని నిపుణులు సూచిస్తున్నారు. డయాబెటిస్ ఉన్న వారు పండ్లలో సహజ చక్కెర ఉంటుందని వాటిని తినడానికి ఇష్టం చూపించరు. కాగా, పండ్లలో కార్బోహైడ్రేట్లతోపాటు శరీరానికి అవసరమైన పోషకాలు, పీచు పదార్థం కూడా ఉంటాయి. ముఖ్యంగా పండ్లను రసం రూపంలో కాకుండా పూర్తిగా తినడం వల్ల అందులోని పీచు చక్కెర రక్తంలోకి వేగంగా చేరకుండా జీర్ణక్రియను నెమ్మది ంపజేస్తుంది. దీంతో రక్తంలో షుగరు స్థాయిలు ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. మధుమేహం ఉన్నవారు పండ్ల రకం, పరిమాణంపై శ్రద్ధ పెట్టడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.అయితే.. మధుమేహం ఉన్నవారికి జామపండు మంచి ఎంపికగా పేర్కొంటున్నారు. ఇందులో పీచు అధికంగా ఉండడంతోపాటు విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్పబెర్రీ వంటి బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, కరిగే పీచు అధికంగా ఉండి చక్కెర తక్కువగా ఉంటుంది. నిపుణుల సూచనలు కాగా.. పియర్‌లో పీచు ఎక్కువగా ఉండడంతో రక్తంలోకి చక్కెర నెమ్మదిగా విడుదల కావడానికి సహాయపడుతుంది. యాపిల్‌ను తొక్కతో తినడం వల్ల పీచు, ఇతర పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. నారింజలో పీచు, విటమిన్ సి, పొటాషియం ఉంటాయి. అయితే నారింజ రసాన్ని తీసుకోవడం కంటే పండును పూర్తిగా తినడం మంచిదని సూచిస్తున్నారు. ఇక, కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ, పొటాషియం, పీచు ఉంటాయి. పరిమితంగా తీసుకుంటే రక్తంలో చక్కెర నెమ్మదిగా పెరిగే అవకాశం ఉంటుంది. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, సహజ ఎంజైములు ఉంటాయి. అయితే సహజ చక్కెరలు ఉండడంతో పరిమాణంపై నియంత్రణ అవనరం. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము ఉన్నప్పటికీ ఇతర కొన్ని పండ్లతో పోలిస్తే సహజ చక్కెర ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవాలి. మామిడిపండులో సహజ చక్కెర, గ్లైసెమిక్ సూచీ ఎక్కువగా ఉండడంతో చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. బెర్రీలు, చెర్రీ లు, యాపిల్ వంటి తక్కువ గ్లైసెమిక్ సూచీ కలిగిన పండ్లను ఎంచుకోవచ్చు. మధుమేహం ఉన్న వారు వైద్యుల సూచనల మేరకే పండ్లను వినియోగించటం మంచిది.

మెదడును కబలిస్తున్న అరుదైన ఫంగస్.. ఆందోళన కలిగిస్తున్న ప్రాణాంతక కేసులు!



మానవ మెదడుపై దాడి చేసే ఓ అరుదైన, ప్రాణాంతక ఫంగల్ ఇన్ఫెక్షన్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని సైంటిస్టులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంలో 'క్లాడోఫియాలోఫోరా బాంటియానా' అనే ఫంగస్ సోకిన కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు పరిశోధకులు గుర్తించారు. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) సైంటిస్టులు ఈ కేసులపై అధ్యయన చేయగా.. ముఖ్యంగా 2023 నుంచి ఈ ఇన్ఫెక్షన్ల సంఖ్య ఒక్కసారిగా భారీగా పెరిగినట్లు వెల్లడైంది. అయితే ఈ ఫంగస్ మనుషులకు ఎలా సోకుతుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో దీని పెరుగుదలకు అసలు కారణాలు ఏమిటనేది అంతుచిక్కుకుండా ఉంది. ఈ అసాధారణ పెరుగుదలకు గల అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు" అని సీడీసీకి చెందిన "మార్బిడిటీ అండ్ మోర్టాలిటీ వీక్లీ రిపోర్టు"లో ప్రచురితమైన పరిశోధనా పత్రంలో రచయితలు పేర్కొన్నారు. సాధారణంగా మానవులలో ఫంగల్ ఇన్ఫెక్షన్లు చాలా అరుదుగా వస్తుంటాయి. ఒకవేళ ఇవి మెదడును చేరినా అది శరీరంలోని వేరే ప్రాంతంలో ఉన్న మరో వ్యాధి తాలూకు ప్రభావం వల్ల జరుగుతుంటుంది. ముఖ్యంగా రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారే ఇలాంటి ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే 'క్లాడోఫియాలోఫోరా బాంటియానా' మాత్రం రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారికే కాకుండా, పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నవారికి కూడా సోకుతుండటం గమనార్హం. ఈ బాధితుల్లో దాదాపు సగం మంది ఆరోగ్యంగా ఉన్నవారే కావడం విశేషం. దీని ప్రధాన లక్ష్యం మెదడే కావడం విశేషం. మెదడులోకి ప్రవేశించి ఈ ఫంగస్ చీముతో నిండిన గడ్డలను సృష్టిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ సోకితే మరణాల రేటు ఏకంగా 60 నుంచి 70 శాతం వరకు ఉంటుందని పరిశోధనా రచయిత జోషువా లీబర్‌మన్ వెల్లడించారు. అంతే కాకుండా ఇది ఎవరినైనా సరే వదలదని, ఈ ఫంగస్ బారిన పడిన రోగుల్లో దాదాపు సగం మంది ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేని, పటిష్టమైన రోగినిరోధక శక్తి ఉన్నవారే కావడం గమనార్హం. ఖీవఙనీఎఎవనిటవట ఈనీతీ జనీబీ ప్రధాని మోదీకి పదవి గండం-అమిత్ షాకు అనారోగ్యం: వేణుస్వామి సంచలన జోస్యం! ఈ అంశంపై స్పష్టత కోసం వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రత్యేక క్లినికల్ రిఫరెన్స్ ల్యాబ్ డేటాను పరిశోధకులు విశ్లేషించారు. అనుమానిత ఫంగల్ మెదడు ఇన్ఫెక్షన్లకు వచ్చిన మొత్తం నమూనాలతో పాజిటివ్ శాంపిల్స్ సంఖ్యను బేరీజు వేసి ఈ గణాంకాలను సేకరించారు. 2009 జనవరి నుంచి 2026 జులై మధ్య కాలం 21 రాష్ట్రాలు, వాషింగ్టన్ డీసీ పరిధిలో 48 నిర్ధారిత కేసులు, ఒక అనుమానిత కేసుతో మొత్తం 49 కేసులు వెలుగుచూశాయి. 2009 నుంచి 2023 వరకు ప్రతి ఏటా కేవలం 1 నుంచి 5 కేసులు మాత్రమే నమోదు కాగా.. 2024 నాటికి ఈ సంఖ్య 8కి, 2025 నాటికి ఏకంగా 14కి ఎగబాకింది. ఈ ఇన్ఫెక్షన్ ఉద్ధృతి 2017లోనే ప్రారంభమైనప్పటికీ.. 2021 నాటికి మరింత స్పష్టంగా బయటపడింది. 2017 నుంచి 2023 మధ్య వెయ్యి నమూనాలకు సగటున 8.4 కేసులు రాగా.. 2023 నుంచి 2025 మధ్య ఈ సంఖ్య ఏకంగా నాలుగు రెట్లు పెరిగింది. 1911లోనే తొలిసారిగా మెదడు గడ్డలో ఈ ఫంగస్‌ను గుర్తించినప్పటికీ.. నేటికీ దీని గురించి సైంటిస్టులకు పూర్తి సమాచారం లేదు. అసలు ఇది ప్రకృతిలో ఎక్కడ నివసిస్తుందో కూడా ఎవరికీ తెలియదు. చర్మం ద్వారా లేదా శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి మెదడుకు చేరుకుంటుందని భావిస్తున్నప్పటికీ.. సంక్రమణ మార్గం ఇప్పటికీ నిర్ధారణ కాలేదు. ఆరోగ్యంగా ఉన్నవారే దీనికి ఎందుకు బలి అవుతున్నారనే ప్రశ్న అలాగే ఉంది. ఏదేమైనా కేసుల పెరుగుదలపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ వ్యాధి తీవ్రతను అంచనా వేయడానికి క్రమబద్ధమైన డేటా సేకరణ అవసరమని స్పష్టం చేస్తున్నారు.

చేమ దుంపల పులుసు.. ఇలా చేస్తే వాసనకే కడుపు నిండుతుంది!

మనం నిత్యం ఎన్నో రకాల వంటలు చేస్తాం. అటువంటి వంటకాలలో పులుసులకు చాలా ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇక పులుసులలో చేమ దుంపల పులుసు సరైన విధానంలో చేస్తే ఆ రుచి వేరుగా ఉంటుంది. నోటికి రుచికరంగా ఉండే, సూపర్ టేస్ట్ ఉండే చేమ దుంపల పులుసు మనం సింపుల్ గా కూడా చెయ్యొచ్చు. ప్రస్తుతం మనం చేమ దుంపల పులుసు ఎలా తయారు చెయ్యాలో తెలుసుకుందాం. తయారీకి కావాల్సిన పదార్థాలు చేమ దుంపలు : 1/4 కేజీ (ఉడికించి తొక్క తీసి కట్ చేసుకున్న ముక్కలు) ఉల్లిపాయలు: 2 కట్ చేసి పెట్టుకున్నవి పచ్చి మిర్చి : 4 కట్ చేసుకున్నవి చింతపండు: నిమ్మకాయ అంత ఉప్పు : ఒకటిన్నర స్పూన్ కారం : ఒకటిన్నర స్పూన్ పసుపు : పావు స్పూన్ పోపు గింజలు : ఒక స్పూన్ జీలకర్ర మెంతుల పొడి : అర స్పూన్ ధనియాల పొడి : ఒక స్పూన్ కరివేపాకు : రెండు రెమ్మలు నూనె : 2 టేబుల్ స్పూన్స్ తయారీ విధానం ముందుగా స్టవ్ వెలిగించి పాన్ పెట్టుకుని రెండు స్పూన్స్ నూనె వేసిన తర్వాత అందులో పోపు గింజలు వేసి వేయించాలి. తర్వాత అందులో కరివేపాకు వేసి వేగిన తర్వాత అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు వేసి కలపాలి. కాస్త మగ్గిన తర్వాత అందులో చేమ దుంపల ముక్కలు వేసి అందులో పసుపు, ఉప్పు, కారం వేసి బాగా కలిపి కొద్దిసేపు మగ్గనివ్వాలి. ఆపై అందులో నీళ్లలో నానబెట్టుకున్న చింతపండు పులుసు పోసి బాగా కలిపి మసలనివ్వాలి. ఆపై అందులో జీలకర్ర మెంతుల పొడి, ధనియాల పొడి వేసి బాగా కలిపి పులుసు మనకు కావాల్సిన చిక్కదనం వచ్చే వరకు ఉడికించి స్టవ్ ఆఫ్ చెయ్యాలి. అంతే రుచికరమైన చేమదుంపల పులుసు రెడీ అవుతుంది. ఈ పులుసు అన్నం, చపాతీ దేనిలోనైనా తింటే బాగుంటుంది. కొందరు పచ్చివి పొట్టు తీసి కూడా పులుసు పెడతారు. కానీ ఉడికించి ముక్కలు కట్ చేసిన తర్వాత చేసిన పులుసు చాలా బాగుంటుంది.

స్పోర్ట్స్ న్యూస్

గతంలో కంటే డేంజరస్‌గా కోహ్లీ ఫామ్: ఏబీ డివిలియర్స్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వయసు పెరుగుతున్నా.. అతడి ఆటలో మాత్రం జోరు తగ్గడం లేదు. కెరీర్ చివరి దశలోనూ వన్డేల్లో పరుగుల వరద పారిస్తూ ప్రత్యర్థి బౌలర్లకు సవాల్ విసురుతున్నాడు. 37 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్న కోహ్లీ.. తన కెరీర్‌లోనే అత్యుత్తమ దశలో ఉన్నాడా? అంటే దక్షిణాఫ్రికా దిగ్గజం, కోహ్లీ మాజీ ఆర్సీబీ సహచరుడు ఏబీ డివిలియర్స్ మాత్రం అవుననే అంటున్నాడు. 2016-17లో కనిపించిన కోహ్లీ కంటే ఇప్పుడు మరింత మెరుగైన ఆటగాడిగా మారాడని అభిప్రాయపడ్డాడు.'2016తో పోలిస్తే ఇప్పుడు కోహ్లీ మరింత మెరుగైన ఆటగాడని నేను భావిస్తున్నా. మైదానంలో అతడు ఎంత ప్రశాంతంగా ఉంటున్నాడో గమనించవచ్చు. పూర్తి స్వేచ్ఛగా ఆడుతున్నట్లు కనిపిస్తున్నాడు. గతంలో కంటే మరింత డేంజరస్‌గా ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నాడు. ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో అతడి ఆటతీరులో మార్పు కనిపించింది. మొదట కొత్త తరహాలో ఆడేందుకు ప్రయత్నించినా.. ఆ తర్వాత దూకుడుగా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తన సహజమైన ఆటను ఆస్వాదించడం మొదలుపెట్టాడు' అని ఏబీడీ అభిప్రాయపడ్డాడు.37 ఏళ్ల వయసులోనూ కోహ్లీ ఇంతటి స్థాయిలో రాణించడానికి అతడి మానసిక స్థితి కూడా కారణమని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'ప్రస్తుతం తన ప్రతిభను బయటపెట్టడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు తన ఆటను ఆస్వాదించేలా చేయడమే తన చేతుల్లో ఉందని కోహ్లీ గుర్తించాడు. అది మరో రెండేళ్లు, మూడేళ్లు లేదా ఐదేళ్లు కావొచ్చు. అతడు ఇంకెంతకాలం ఆడతాడో నాకు తెలియదు. కానీ కోహ్లీ ఆటలో ఈ కోణాన్ని చూడటం నాకు ఎంతో ఆనందంగా ఉంది. యువ ఆటగాళ్లకు కోహ్లీతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం గొప్ప అనుభవం. ప్రస్తుతం కోహ్లీ ఉన్న మానసిక స్థితి, ఆట పట్ల అతడికున్న స్పష్టత నుంచి యువ క్రికెటర్లు గతంలో కంటే ఎక్కువగా నేర్చుకునే అవకాశం ఉంది' అని డివిలియర్స్ వెల్లడించాడు.



శాండ్ పేపర్ వివాదంపై లక్షలసార్లు సమాధానం చెప్పాం: ప్యాట్ కమిన్స్



ఆస్ట్రేలియా-సౌతాఫ్రికా మధ్య మూడు టెస్టుల సిరీస్ జరగనున్న నేపథ్యంలో.. 2018 శాండ్ పేపర్ వివాదం వార్తల్లో నిలిచింది. ఈ క్రమంలో ఆసీస్ మాజీ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా.. తన ఆత్మకథ 'సబ్'లో ఈ ఉదంతానికి సంబంధించిన పలు కొత్త విషయాలు ప్రస్తావించే అవకాశం ఉందంటూ వస్తోన్న వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. అయితే ఈ పరిణామాలపై ఆసీస్ ప్రస్తుత కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించాడు. ప్రొటీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడాడు.'కొన్ని వారాల క్రితం ఉజ్(ఉస్మాన్ ఖవాజా) నాకు ఫోన్ చేసి ఓ పుస్తకం విడుదల చేయనున్నట్లు చెప్పాడు. అందులోని విషయాల గురించి పెద్దగా వివరించలేదు. కేవలం పుస్తకం రాస్తున్నానని ముందుగా సమాచారం ఇచ్చాడు. నేను కూడా ఎప్పటిలాగే.. ఫర్వాలేదు, నీ కథ నువ్వు చెప్పుకో.. అందులో ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పాను' అని కమిన్స్ వివరించాడు. శాండ్ పేపర్ వివాదం జరిగినప్పుడు కమిన్స్, ఖవాజా కూడా జట్టులోని సభ్యులే. దీంతో ఈ వివాదంపై మరిన్ని వివరాలు తెలుస్తాయా? అంటూ రిపోర్టర్ అడిగా.. కమిన్స్ సమాధానం ఇచ్చాడు.'దాని గురించి ఏమి రాశారో నాకు తెలియదు. ఆ విషయాన్ని ఖవాజానే అడిగి తెలుసుకోవాలి. అది జరిగి చాలా కాలమైంది. అప్పట్లోనే అన్ని విచారణలు పూర్తయ్యాయి. ఈ అంశంపై నేను కొన్ని లక్షల సార్లు ప్రశ్నలకు సమాధానాలు చెప్పాను. అప్పుడే దానికి ముగింపు పలికాం. ఒక జట్టుగా మేం ఆ వివాదాన్ని దాటేసి వచ్చాం. గత ఎనిమిది, తొమ్మిదేళ్లలో మా జట్టు ఎలా ఎదిగింది? ఎలా మారింది? అన్న విషయంలో నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఇప్పుడు నా దృష్టంతా జట్టుకు నాయకత్వం వహించడంపైనే ఉంది' అని కమిన్స్ వివరించాడు.

గంగూలీ బయోపిక్ 'దాదా' పోస్టర్‌పై విమర్శలు.. హీరో రియాక్షన్ ఇదే!

భారత క్రికెట్ దిగ్గజం సౌరభ్ గంగూలీ జీవిత కథ ఆధారంగా తెరుకెక్కుతున్న 'దాదా' చిత్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తోన్న సంగతి తెలిసిందే. గంగూలీ పుట్టిన రోజు కానుకగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఏఐతో చేశారంటూ అభిమానులు, నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై గంగూలీ పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ హీరో రాజ్‌కుమార్ రావు స్పందించారు. పోస్టర్‌పై వచ్చిన విమర్శలను చిత్ర బృందం స్వీకరించిందని, తమ తప్పును తెలుసుకుందని తెలిపారు.'ఆ పోస్టర్ తయారు చేసినవారు తమ తప్పు నుంచి పాఠం నేర్చుకున్నారు. ఏ పనైనా తొందరపడి చేయకూడది, సమయం తీసుకోవాలని తెలుసుకున్నారు. దాదాకు అభిమానుల్లో ఎలాంటి ఆదరణ ఉందో ఈ ఘటనతో వారికి స్పష్టమైంది' అని రాజ్‌కుమార్ అన్నారు. గంగూలీ అంతర్జాతీయ క్రికెట్‌లో చిరస్మరణీయంగా నిలిచిన సందర్భాల్లో ఒకటైన లార్డ్స్ మైదానంలోని చొక్కా విప్పి గాల్లో తిప్పిన ఘట్టాన్ని 'దాదా' పోస్టర్‌లో రీక్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే పోస్టర్ విడుదలైనప్పటి నుంచి నెటిజన్లు ఏఐతో రూపొందించారంటూ విమర్శలు చేశారు.సౌరభ్ గంగూలీతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందని రాజ్‌కుమార్ రావు వెల్లడించారు. 'నేను గంగూలీని చాలాసార్లు కలిశాను. ఆయన ఇంట్లో, ఈడెన్ గార్డెన్స్‌లో కూడా షూటింగ్ చేశాం. కోల్‌కతాలో కొంతకాలం ఉన్నాం. దాదాతో చాలా సమయం గడిపాను. ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. ఒక వ్యక్తి ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలు తెలుసుకోవాలి. వాటిలో కొన్నింటిని ఇప్పుడు వెల్లడించలేను. ఆయన కూడా చాలా విషయాలను బహిరంగంగా పంచుకున్నారు. మేమంతా ఆయనను ప్రేమిస్తాం. ఆయన ఓ దిగ్గజం. నేటి భారత క్రికెట్ జట్టు ఈ స్థాయికి చేరుకోవడానికి పునాది వేసిన వారిలో గంగూలీ ఒకరు' అని రాజ్‌కుమార్ పేర్కొన్నారు.



బీసీసీఐ క్రీడా కమిటీ బడ్జెట్ భారీగా పెంపు.. ఏకంగా రూ. 127 కోట్లు



భారత క్రికెటర్లను వరుసగా వేధిస్తున్న గాయాల సమస్యపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)దృష్టి సారించింది. గత ఏడాదికాలంలో టీమిండియా చెందిన సుమారు 32 మంది టాప్ ప్లేయర్లు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (అనీఇ)లో పునరావాసం (రీహాబ్), చికిత్స పొందినట్లు నివేదికలు తెలిపాయి. ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ముగిసిన తర్వాత సీఓఈ కేంద్రానికి వచ్చే ఆటగాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.గాయాల తీవ్రతను తగ్గించి, ఆటగాళ్లను త్వరగా పూర్తి ఫిట్‌నెస్‌లోకి తీసుకువచ్చేందుకు గానూ బీసీసీఐ తమ ఇంజ్యూరీ మేనేజ్‌మెంట్ బడ్జెట్‌ను గణనీయంగా పెంచింది. గతేడాది రూ.92 కోట్లుగా ఉన్న బడ్జెట్‌ను రూ.35 కోట్లు పెంచి.. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.127 కోట్లు కేటాయించింది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వంటి వారు ఆటగాళ్ల వరుస గాయాలపై ఆందోళన వ్యక్తం చేయడంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ సైతం ఇటీవల ఫిట్‌నెస్, రీహాబ్ ప్రక్రియ కోసం సీఓఈను సందర్శించారు.జస్ప్రీత్ బుమ్రా , హార్దిక్ పాండ్యా , వాషింగ్టన్ సుందర్ , నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ సీఓఈకి క్రమం తప్పకుండా వెళ్తుంటారు. కానీ వారు పునరావాసం కోసం ఎన్నిసార్లు చేరాల్సి వచ్చిందో ఆ నివేదికలో ప్రస్తావించలేదు. ఆటగాళ్ల పనిభారాన్ని (వర్క్‌లోడ్) క్రమబద్ధీకరిస్తూ, కీలక టోర్నీలకు వారు పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉండేలా ఆధునిక వైద్య సదుపాయాలు అందిస్తున్నట్లు బోర్డు వర్గాలు వెల్లడించాయి.

పదేళ్ల తర్వాత జట్టులోకి.. 33 బంతులు, 0 పరుగులు!

చాలా కాలం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన ప్లేయర్.. చక్కటి ప్రదర్శన చేసి గుర్తింపు పొందాలని చూస్తారు. కానీ ఓ ప్లేయర్ మాత్రం దాదాపు దశాబ్ద కాలం తర్వాత జట్టులోకి వచ్చి ఓ చెత్త రికార్డును తన పేరిట నమోదు చేసుకున్నాడు. డర్బన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఓపెనర్ నిక్ మాడిసన్ అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. దాదాపు 10 ఏళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన నిక్ మాడిసన్ 33 బంతులాడి పరుగులు ఖాతా తెరవకుండానే డకౌట్‌గా వెనుదిరిగాడు. ఈ నేపథ్యంలో టెస్టు చరిత్రలో నిక్ మాడిసన్‌ది బంతుల పరంగా మూడో లాంగెస్ట్ డకౌట్ కావడం గమనార్హం.నిక్ మాడిసన్ కంటే ముందు న్యూజిలాండ్ ఓపెనర్ డారిన్ ముర్రే తొలి స్థానంలో ఉన్నాడు. అతడు 1995లో శ్రీలంకతో జరిగిన టెస్టులో 39 బంతులు ఆడి డకౌట్ అయ్యాడు. రెండో స్థానంలో జింబాబ్వే ఓపెనర్ ట్రెవర్ గ్రిఫ్ఫర్ (36 బంతుల్లో డకౌట్, 2000 మార్చిలో వెస్టిండీస్‌పై) ఉన్నాడు. తాజాగా నిక్ మాడిసన్ 33 బంతుల్లో డకౌటయ్యి మూడో స్థానంలో నిలిచాడు. ఇక నాలుగో స్థానంలో జింబాబ్వే ఓపెనర్ మార్క్ దెక్కర్ (30 బంతుల్లో) ఉన్నాడు. ఇంగ్లండ్ ఓపెనర్ బ్రియాన్ లక్ హర్స్ట్ (29 బంతుల్లో డకౌట్) ఐదో స్థానంలో ఉన్నాడు.ఇక ఆస్ట్రేలియా తరఫున టెస్టుల్లో అత్యంత ఎక్కువ బంతులు ఆడి డకౌట్ అయిన ఓపెనర్‌గా మాత్రం నిక్ మాడిసన్ నిలిచాడు. గతంలో 2022లో హోబర్ట్ వేదికగా జరిగిన టెస్టులో ఓపెనర్ డేవిడ్ వార్నర్ (22 బంతుల్లో డకౌట్) ఇప్పటివరకు సుదీర్ఘ డకౌట్‌గా ఉండేది. తాజాగా వార్నర్ చెత్త రికార్డును నిక్ మాడిసన్ ఏకంగా 11 బంతుల తేడాతో బ్రేక్ చేశాడు. మాడిసన్ చివరిసారిగా 2016లో పాకిస్తాన్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆస్ట్రేలియా తరపున టెస్ట్ ఆడాడు.మాడిసన్ ఏడాదికి పైగా ఫస్ట్-క్లాస్ మ్యాచ్ ఆడకున్నా.. జాతీయ జట్టుకు అతడి ఎంపిక ఆశ్చర్యం కలిగించింది. సరిగ్గా 18 నెలల క్రితం అతడు క్యాన్సర్‌కు కీమోథెరపీ చేయించుకున్నాడు. మాడిసన్ ఎంపికపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ, టాస్ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. ఆ సీనియర్ బ్యాటర్‌ను ప్రశంసించాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో తడబడుతోంది. 36 ఓవర్లు ముగిసేసరికి నాలుగు వికెట్లు నష్టపోయి 107 పరుగులు చేసింది. ముల్డర్, మార్కో చెరో రెండు వికెట్లు తీశారు.



అదంతా ఫేక్.. నేను ఏ మతాన్నీ కించపరచలేదు: ఇర్ఫాన్ పఠాన్

తన పేరుతో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఏ మతాన్ని కించపరిచేలా ఎప్పుడూ మాట్లాడలేదని స్పష్టం చేశాడు. తనకు ఆపాదిస్తూ వస్తున్న వ్యాఖ్యలను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేసే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని అభిమానులను కోరాడు. కేవలం వ్యూస్ కోసం కొందరు తన పేరును ఉపయోగించుకుంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మండిపడ్డాడు.'ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం వ్యూస్ సంపాదించాలనే ఉద్దేశంతో నా పేరుతో ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి వార్తలను నమ్మవద్దని, షేర్ చేయవద్దని అందరినీ కోరుతున్నా. ఏదైనా వార్త నేరుగా నా నుంచి రానప్పుడు దాన్ని నమ్మకండి. నా మతం విషయంలోనే కాదు.. ఏ మతం గురించి కూడా నేను ఎప్పుడూ తప్పుగా మాట్లాడలేదు. ఇలాంటి తప్పుడు ఆరోపణలను నమ్మే ముందు, ఇతరులకు పంపించే ముందు వాస్తవాలను ధ్రువీకరించుకోవాలని గట్టిగా కోరుతున్నా' అని ఇర్ఫాన్ పేర్కొన్నాడు.





సినిమా



పవన్ కల్యాణ్ నా చిన్ననాటి క్రష్: ఆనంది



తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు. తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

నా వైఫ్ మిస్సింగ్ టీజర్ రిలీజ్



ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్ తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎగ్జైటింగ్ సిరీస్ ను మన ముందుకు తీసుకొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ నా వైఫ్ మిస్సింగ్ ఈ నెల 22వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది. నా వైఫ్ మిస్సింగ్ సిరీస్ ను లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్ పై శివ కంఠంనేని నిర్మించారు. స్వాతిప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహించారు. ఈ రోజు నా వైఫ్ మిస్సింగ్ టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే -- పెద్దలు కుదిర్చిన సంబంధంతో వైవాహిక జీవితంలోకి అడుగుపెడతారు వరుణ్, శ్వేతా. వారి దాంపత్య జీవితం సంతోషంగా సాగుతూ ఉంటుంది. కానీ టీజర్ లో పెళ్లిచూపుల సమయంలోనే తను వర్జిన్ కాదు అని హీరోయిన్ చెప్పడంతో హీరో షాక్ కు గురైనట్లు చూపించారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్ లో తన వైఫ్ మిస్ అయినట్లు వరుణ్ కంప్లైంట్ ఇవ్వడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. పెళ్లి చూపుల సమయంలో శ్వేత చెప్పింది నిజమేనా, ఆమె మిస్సింగ్ కు కారణాలు ఏంటి, వరుణ్ పోలీసుల సహాయంతో తన భార్య ఎక్కడుందో తెలుసుకోగలిగాడా అనే ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ తో టీజర్ ఆకట్టుకుంటోంది. కొత్త బంగారు లోకం సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ జంట.. ఇప్పుడు మరోసారి వెండితెరపై కలిసి కనిపించేందుకు సిద్ధమవుతోంది. కొత్త బంగారు లోకంలో వీరిద్దరి కెమిస్ట్రీ అప్పట్లో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా యువతకు ఈ జోడీ బాగా కనెక్ట్ కావడంతో, వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి ఒకే సినిమాలో కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

సక్సెస్ మాత్రం అందుకోలేకపోతున్నారు



పాయల్ రాజ్‌పుత్‌కు ఆఫర్లు తగ్గాయా? ఒకే ఒక్క సినిమాతో స్టార్‌గా మారి.. ఇప్పుడు మళ్లీ గట్టిగా ప్రయత్నిస్తున్న ఈ హీరోయిన్ తెలుగు సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు పాయల్ రాజ్‌పుత్. అందం, గ్లామర్‌తో పాటు నటనతోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. కెరీర్ ప్రారంభంలోనే భారీ సక్సెస్‌ను అందుకుంది. అయితే ఆ తర్వాత అదే స్థాయిలో వరుస విజయాలను అందుకోలేకపోయింది. దీంతో ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా కనిపించిన పాయల్.. ఇప్పుడు ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌ను 'ఆర్ 100'కు ముందు.. ఆ తర్వాత అని చెప్పుకోవచ్చు. 2018లో అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సంచలన విజయాన్ని అందుకోవడంతో పాయల్ ఒక్కసారిగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆమె పోషించిన ఇందు పాత్ర ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో పాయల్ చూపించిన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. పాయల్ కూడా పలుమార్లు 'ఆర్ 100' తన జీవితాన్ని మార్చేసిన సినిమా అని చెప్పుకొచ్చింది. 'ఆర్100' తర్వాత పాయల్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం ఆమెకు ఆశించిన స్థాయిలో విజయాలను అందించలేకపోయాయి. 'సీత', 'ఆర్ డీ ఎక్స్ లవ్', 'వెంకీ మామ', 'డిస్కో రాజా', 'అనగనగా ఓ అతిథి', 'తీస్ మార్ ఖాన్', 'జిన్నా', 'మయా పేటిక', 'రక్షణ' వంటి చిత్రాల్లో నటించినప్పటికీ.. 'ఆర్ ఎక్స్ 100' స్థాయి ఇంపాక్ట్ మాత్రం మరోసారి రాలేదు. ఆర్ 100 తర్వాత పాయల్‌కు మరోసారి బలమైన గుర్తింపు తీసుకొచ్చిన సినిమా 'మంగళవారం'. అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో షైలుగా ఆమె చాలా విభిన్నమైన పాత్రను పోషించింది. ఈ పాత్ర కోసం మానసికంగా, భావోద్వేగంగా చాలా కష్టపడాల్సి వచ్చిందని పాయల్ స్వయంగా చెప్పింది. 'మంగళవారం' తన కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలిచింది. ఈ సినిమా ద్వారా తాను కేవలం గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాదని పాయల్ నిరూపించుకునే ప్రయత్నం చేసింది. కానీ స్టార్ హీరోయిన్ స్థాయిలో వరుసగా భారీ కమర్షియల్ సినిమాలు, పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం మాత్రం తగ్గింది. దీనిపై గతంలో పాయల్ కూడా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'ఆర్100'లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేయడం వల్ల ప్రేక్షకులు, దర్శకులు తనను అదే తరహా పాత్రల్లో ఊహించి ఉండొచ్చని ఆమె అభిప్రాయపడింది. తాను అన్ని రకాల పాత్రలు చేయాలనుకుంటున్నానని, ఇంకా తనకు చాలా దూరం వెళ్లాల్సి ఉందని చెప్పింది. రీసెంట్ గా లీడర్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది.



50 కోట్ల క్లబ్బులో 'మందాడి'

తమిళంలో హాస్య నటుడిగా కెరీర్ ప్రారంభించి, తర్వాత కథానాయకుడిగా మారిన నటుడు సూరి. తెలుగులో యూట్యూబ్ ఫిలిమ్స్ నుంచి కెరీర్ స్టార్ట్ చేసి, తర్వాత సినిమాల్లో హీరోగా స్నేహితుడి పాత్రలు చేసి, ఆ తర్వాత హీరోగా మారిన నటుడు సుహాస్. వీళ్ళిద్దరూ కలిసి నటించిన సినిమా 'మందాడి'. మందాడి'లో సూరి హీరోగా, సుహాస్ విలన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. మతిమారన్ పుగళేంది దర్శకుడు. సూరి సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించగా... నట్టరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. కలెక్షన్స్ పరంగా ఈ సినిమా సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది. బాక్స్ ఆఫీస్ బరిలో 'మందాడి' సినిమా 150 కోట్ల రూపాయలు కలెక్ట్ చేసింది. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సెప్టెంబర్ 10న విడుదల చేసింది. తెలుగులో మంచి స్పందన అందుకుంది. తమిళనాడు బాక్స్ ఆఫీస్ లెక్కలు చూస్తే... కొత్త రికార్డులను క్రియేట్ చేసింది. తమిళ, తెలుగు రాష్ట్రాలతో పాటు విడుదల చేసిన అన్ని ఏరియాలలో 'మందాడి'కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటి వరకు తమిళనాడులో వంద కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. అటు సూరి, ఇటు సుహాస్... ఇద్దరి కెరీర్‌లలో 'మందాడి' బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 'మందాడి'లోని బోట్ సీక్వెన్స్, రేసింగ్ సన్నివేశాలకు థియేటర్లలో విజిల్స్ పడ్డాయి. ఈ చిత్రానికి కథిర్ విజువల్స్, జీవీ ప్రకాష్ సంగీతం, పీటర్ హెయిన్ - దిలీప్ సుబ్బరాయన్ - మహేష్ మాథ్యూ యాక్షన్ సీక్వెన్స్ హైలెట్‌గా నిలిచాయి. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ సహా పలువురు తమిళ సెలబ్రిటీలు ఈ సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ చిత్రానికి మణికందన్ సహా నిర్మాత.





స్థానిక ఎన్నికలకు సుప్రీం గ్రీన్ సిగ్నల్.. వైఎస్సార్సీపీ కుట్రలు భగ్నం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మగట్ట తెలుగుకలం ప్రతినిధి :ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి వైఎస్సార్సీపీ నాయకత్వం పన్నిన కుట్రలు అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పుతో పూర్తిగా వీగిపోయాయని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.



గుమ్మగట్ట మండలం మారేంపల్లి గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్సీపీ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ ముగిసిన తర్వాతే మున్సిపల్ వార్డుల పునర్విభజన జరగాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంతో, రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేకనే, ఏదో ఒక కారణంతో పోరును వాయిదా వేయించాలని వైకాపా కుట్రలు పన్నిందని విమర్శించారు. సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుందని కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంలోనే బీసీ వర్గాల అభ్యున్నతిపై ఆయన కీలక ప్రకటన చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయించే రిజర్వేషన్ శాతంతో సంబంధం లేకుండా, తెలుగుదేశం పార్టీ మాత్రం బీసీలకు 34 శాతానికి మించి స్థానిక పోరులో పోటీ చేసే అవకాశాలు కల్పిస్తుందని తేల్చిచెప్పారు. బీసీల ప్రగతి ప్రయాణం ఎప్పుడో టీడీపీ తోనే ప్రారంభమైందని, భవిష్యత్తులోనూ వారికి రాజకీయంగా మరిన్ని ప్రాధాన్యతలు ఇస్తామని స్పష్టం చేశారు.

పత్తికొండ రూరల్ సీ ఐ పెద్దయ్య నాయుడు ని కలసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



పత్తికొండ (తెలుగు కలం) అక్టోబర్ 09:-పత్తికొండ రూరల్ సీఐ గా బాధ్యతలు స్వీకరించిన పెద్దయ్య నాయుడు నీ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామ కొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,పులికొండ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ముత్యాల ఈశ్వరయ్య, బొంతల నరసింహులు ,ముత్యాల ప్రసాద్, చిన్న ఎల్లప్ప, ఎద్దులదొడ్డి జగన్నాథ్, కప్పట్రాళ్ల లక్ష్మన్న, గుండ్లకొండ రాజు,శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీలు ఎస్టీలు నిరుపేద కుటుంబాల మీద దాడి,అన్యాయం జరిగినప్పుడు ఎమ్మార్పీఎస్ ఆ సందర్భంలో సంఘం దళితులకు న్యాయం జరిగేవిధంగా పని చేస్తుందని తెలిపారు. ఎస్సీ ఎస్టీలను మొబలై జేషన్ చేసి వారికి కేసులు పైన అవగాహన పెంచి రాజిమార్గంలో చేయాలని సీఐ పెద్దయ్య నాయుడు కి తెలిపారు అదేవిధంగా ఎస్సీలకు విద్య ఉద్యోగం పైన అవగాహన లేకపోవడం వల్ల వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని సీఐ ని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డబ్ల్యూ.ఈ.సి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



గోదావరిఖని (తెలుగు కలం) అక్టోబర్-9ప్రభుత్వ డీగ్రీ కళాశాల, గోదావరిఖని లోమహిళా సాధికారత విభాగం డబ్ల్యూ. ఈ. సి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కళాశాలలో మహిళా సాధికారత విభాగం డబ్ల్యూ. ఈ.సి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల ఐక్యత, సాధికారత, ప్రకృతి పట్ల గౌరవం వంటి విలువలను చాటిచెప్పారు.కళాశాల ప్రిన్సిపాల్ ఖతీనీట. జైకిషన్ ఓఝు గారు కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థినుల్లో సంప్రదాయాల పట్ల అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన అధ్యాపకులు, ఆతీ. జి. శారద, సవిత, శ్రీదేవి, సుమలత, ప్రవంతి, సమత, నివేదిత, శ్రీలత, జలజ మరియు వైస్ ప్రిన్సిపాల్ సాంబ శివ రావు, సుబ్బారావు, తిరుపతి, శంకరయ్య,ఆంజనేయులు, అజయ్ కుమార్,నరేష్, రవీందర్, రామకృష్ణ, ప్రసాద్, సతీష్, కిరణ్ మరియు విద్యార్థినులను అభినందించారు.ఈ వేడుకలు కళాశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పి, అందరిలో ఆనందాన్ని నింపాయి.

మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు!

డోన్‌లో రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష విధించిన కోర్టు

డోన్ (తెలుగు కలం) అక్టోబర్ 09:-మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డోన్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో విచారణ చేపట్టిన డోన్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధించింది.కోర్టులో విచారణకు వచ్చిన ఈ రెండు కేసుల్లో తమిళనాడు రాష్ట్రం ఈరోడ్ ప్రాంతానికి చెందిన స్వామినాథన్ గోవిందసామి (48)కి ఏడు రోజుల జైలు శిక్ష, డోన్ పట్టణంలోని కృష్ణమూర్తి నగర్‌కు చెందిన ఎట్టి శ్రీకాంత్ (30)కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలుమద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యల వల్ల వాహనం నడిపే వ్యక్తితో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. నేర తీవ్రత, వర్తించే చట్ట నిబంధనల ప్రకారం జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.ప్రజల భద్రతే లక్ష్యంరోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. మద్యం సేవించిన తర్వాత వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ ప్రయాణ మార్గాలను ఎంచుకోవాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేసేది లేదని డోన్ టౌన్ పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఘనంగా డాక్టర్ సాకే శైలజనాథ్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు:



శింగనమల,అక్టోబర్ 09:-(తెలుగు కలం న్యూస్):-శింగనమల నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్,డాక్టర్ మోక్ష ప్రసన్న దంపతులకు పుట్లూరు మండల వైఎస్సార్సీపీ నాయకులు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పుట్లూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి,జిల్లా యువజన కార్యనిర్వాహక సభ్యుడు నొస్సం నరసింహ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో వైఎస్సార్సీపీ నాయకులు మహేశ్వర్ రెడ్డి,శివ,జగన్మోహన్ రెడ్డి,హజీవలీ,నారే అశోక్ కుమార్ రెడ్డి,రామ్మోహన్‌తో పాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు.డాక్టర్ సాకే శైలజ నాథ్,డాక్టర్ మోక్ష ప్రసన్న దంపతులు ఆయురారోగ్యాల తో,సుఖనంతోషాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని నాయకులు ఆకాంక్షించారు.

నార్పలలో ఈ నెల 11 నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు:



నార్పల,అక్టోబర్ 09:- (తెలుగు కలం న్యూస్):-నార్పల మండల కేంద్రంలోని తిక్కయ్య స్వామి ఆశ్రమం వద్ద వెలసిన శ్రీ చక్ర శ్రీనివాస స్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గవ్వల నుబ్బయ్య,అర్చకులు మాడుగుల రఘునాథ శర్మ తెలిపారు.ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు వివిధ వాహన సేవలతో స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 11న ధ్వజారోహణం, శేష వాహన సేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, 12న హంస వాహనం,13న సింహ వాహనం,14న సర్వభూపాల వాహనం,15న గరుడ వాహనం, 16న హనుమంత వాహనం, 17న గజ వాహనం,18న సూర్యప్రభ,చంద్రప్రభ వాహన సేవలు,19న అశ్వ వాహనం, 20న రథోత్సవం,21న చక్ర స్నానం నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ బ్రహ్మోత్సవాల కు నార్పలతోపాటు పరినర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ఆయన ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తులందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయ వంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

కాన్షీరాం ఆశయాల సాధనే నిజమైన నివాళి..!

ఘనంగా వర్ధంతి వేడుకలు.

దళిత,బహుజన నేతల నివాళులు:

నార్పల,అక్టోబర్ 09:-(తెలుగు కలం న్యూస్):-దళిత,బహుజన,వెనుకబడిన తరగతులు,మైనారిటీల హక్కుల సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానాయకుడు కాన్షీరాం అని దళిత నాయకులు కొనియాడారు.అక్టోబర్ 9న కాన్షీరాం వర్ధంతి సందర్భంగా పుట్లూరు మండలంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 1934 మార్చి 15న పంజాబ్ రాష్ట్రంలో జన్మించిన కాన్షీరాం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, బహుజన సమాజంలో సామాజిక,రాజకీయ చైతన్యం తీసుకురావడానికి తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు.1978లో బామ్‌సెఫ్, 1981లో డీఎస్-4 సంస్థలను, 1984 ఏప్రిల్ 14న బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించి, అణగారిన వర్గాలు రాజకీయ అధికారంలో భాగస్వాములు కావాలని కృషి చేశారని పేర్కొన్నారు.ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడంలో,మాయా వతి ముఖ్యమంత్రి కావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.2006 అక్టోబర్ 9న కాన్షీరాం మరణించినప్పటికీ,ఆయన ఆశయాలు నేటికీ స్ఫూర్తి దాయకమని నాయకులు అన్నారు.నమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ,అణగారిన వర్గాల హక్కుల సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు,రాష్ట్ర సమితి సభ్యుడు చీమల నల్లప్ప అధ్యక్షత వహించారు.సత్య సాయి జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుట్లూరు మండల అధ్యక్షుడు రాఘవ,నార్పల మండల అధ్యక్షుడు వెంకట్రాముడు, సింగనమల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సాకే వెంకట్రాముడుతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన దళిత నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.



జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే సంబరాలు.. అట్టహాసంగా సాంస్కృతిక వేడుకలు!

నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం.. ఆకట్టుకున్న నృత్యాలు, నాటికలు

డోన్ (తెలుగు కలం) అక్టోబర్ 9: -డోన్ పట్టణంలోని జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడం, నూతన వాతావరణానికి అలవాటు పడేలా ప్రోత్సహించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ భారతి, సీనియర్ అధ్యాపకులు రమణారెడ్డి, అక్తర్ బాను, వెంకటస్వామి తదితరులు హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో కళాశాల దశ ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు విద్యా, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, స్కిట్లు, నాటికలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తమలోని కళాత్మక ప్రతిభను చాటుకుంటూ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ప్రదర్శనకు తోటి విద్యార్థుల నుంచి చప్పట్లతో ప్రోత్సాహం లభించడంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మకత, ప్రతిభ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి.సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహబంధంనూతన విద్యార్థులను సీనియర్లు ఆత్మీయంగా స్వాగతిస్తూ కళాశాల సంప్రదాయాలు, విలువలను గౌరవించాలని సూచించారు. చదువులో వరన్వరం నహకరించుకుంటూ, అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కోరారు. సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య నత్సంబంధాలు పెంపొందించడంతో పాటు, వారిలో ఐక్యతా భావాన్ని బలోపేతం చేసేందుకు ఫ్రెషర్స్ డే వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అధ్యాపకులు పేర్కొన్నారు.ఈ వేడుకలు నూతన విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు కళాశాల జీవితంపై సానుకూల దృక్పథాన్ని పెంపొందించాయి. కార్యక్రమంలో కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు వనమాలి, విద్యార్థినులు లిఖిత, రాజేశ్వరి, ఇతర విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED BY : D.NO. 25/714, HAVANNA PET, MARKENDEYA SWAMY TEMPLE, ADONI (TOWN & POST), KURNOOL, ANDHRA PRADESH - 518301.